సాక్షి
సంగారెడ్డి
గురువారం । 28 । మార్చి । 2024



ఆహ్లాదం.. ఆలస్యం
జహీరాబాద్ సమీపంలో చేపడుతున్న 'అర్బన్ ఫారెస్ట్ పార్క్' పనులు ముందుకు సాగడం లేదు. వివరాలు 8లో ▸



ప్రమాదాలకు నెలవు..
జహీరాబాద్ బైపాస్ రోడ్డులోని అల్గోల్ చౌరస్తా ప్రమాదాలకు స్పాట్‌గా మారింది. వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం (సాయంత్రం) 06:34	శుక్రవారం (ఉదయం) 04:51

న్యూస్‌రీల్

సెక్టార్ అధికారులదే కీలక బాధ్యత


మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలక బాధ్యత ఉంటుందని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సెక్టార్ అధికారులకు పోలింగ్ నిర్వహణపై మాక్ పోల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారు సాంకేతిక అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల అధికారులు ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో 12 పోలింగ్ స్టేషన్‌లు ఉంటాయన్నారు. అందులో మౌలిక సదుపాయాలను ముందస్తుగా పరిశీలించాలన్నారు. శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 1 లేదా 2వ తేదీలో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. గైర్హాజరైన వారికి షోకాజ్‌లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ, ఆర్డీఓలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారికి ఇంటి వద్దే ఓటు..

85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారు ఇంటి నుంచి ఓటు వేసే సౌకర్యం ఉందని కలెక్టర్ క్రాంతి అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓ సమన్వయంతో తొలగించే పేర్ల విషయమై జాగ్రత్త వహించాలన్నారు. లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మెదక్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ అన్నారు.

పంటలు ఎండనివ్వం


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద ఎండుతున్న పంటలు కాపాడేందుకు నీటి సరఫరా చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బీబీపేట శివారులో నల్లవాగు కాల్వ ఆధునీకరణ పనులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఎండుతున్న పంటలు, సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ పనులు నిలుపుదల చేస్తామన్నారు. రెండు రోజుల్లో నల్లవాగు డీ–4 కెనాల్ పరిధిలో బీబీపేట, ఫత్తేపూర్ గ్రామాల వరకు నీటిని సరఫరా చేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లవాగు ప్రాజెక్టు కింద క్రాప్‌హాలిడే ప్రకటించారని గుర్తుచేశారు. కాల్వల మరమ్మతు పనులు చేయకుండా రైతులతో రాజకీయం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్‌ను ఒప్పించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జరుగుతున్న పనుల పట్ల క్వాలిటీ కంట్రోల్ అధికారులు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. బీబీపేట మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు కిషన్‌రెడ్డి, రైతులు ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిశారు. నీటి సరఫరా చేయాలని విన్నవించారు. కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రెడ్డి, సంగారెడ్డి, లక్ష్మయ్య, సాయిలు, సాయిగౌండ, జయరాజ్ పాల్గొన్నారు.

డేంజర్ బెల్స్

మెతుకు సీమలో రోజు రోజుకు భూగర్భ జలాలు పడిపోతున్నాయి. సాగు నీటికి తీవ్ర కటకట నెలకొంది. గతేడాది కంటే తక్కువగా వర్షం కురవడమే ఇందుకు కారణం. దీంతో మార్చి నెలలోనే భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుని పలు మండలాల్లో డేంజర్ బెల్స్‌ను మోగిస్తున్నాయి. బావులు, బోర్లు అడుగంటి పోవడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు.

జలం.. కలకలం
- రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు
- 20 మండలాల్లో 15 మీటర్ల లోతుకు చేరిన నీళ్లు
- పలు చోట్ల వట్టిపోయిన బోర్లు, బావులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగు నీటికి కటకట

జిల్లా	ఫిబ్రవరి 2023	ఫిబ్రవరి 2024 (లోతు మీటర్లలో)
మెదక్	12.16	12.98
సిద్దిపేట	8.66	10.07
సంగారెడ్డి	11.04	11.24



చేర్యాల మండలం కడవేర్గులో ఎండిపోయిన 14 గజాల లోతు బావి

సాక్షి, సిద్దిపేట...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు పడిపోయాయి. సుమారు 20 మండలాల్లో 15 మీటర్ల కంటే లోతుకు జలాలు చేరుకున్నాయి. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో అత్యధికంగా 31.78 మీటర్ల లోతుకు జలం చేరుకుంది. అల్లాదుర్గం 17.96 మీటర్లు, కొడిపల్లిలో 15.65, కొల్చారం 21.66, శివ్వంపేట (గుడూరు) 15.34, తుప్రాన్ 21.66, మాసాయిపేట 15.66, నర్సాపూర్ 18.28, నార్సింగి 24.58, రామాయంపేట(ధర్మారం)24.79, రేగోడ్ (గజ్వాడ) 21.55, శంకరంపేట 22.95, వెల్దుర్తి 21.02, హత్నూర్ 18.69, కంది 16.57, కొండాపూర్ 16.01, నిజాంపేట 15.12, దౌమ్మాట 23.02, దుబ్బాక (గంబీపూర్) 24.91, అక్కన్నపేట-భూంపల్లి (చిట్టాపూర్) 17.01 మీటర్ల లోతుకు జలాలు చేరాయి. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు అడుగంటి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అడుగంటిన భూగర్భ జలాలతో బోర్లు సైతం ఆగిఆగి పోస్తున్నాయి. దీంతో పంటలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. చెరువులు, కుంటలపై ఆశలు పెట్టుకోగా..అవి సైతం అడుగంటుతుండటంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. కొత్తగా బోర్లు వేసినా ఫలితం లేకుండా పోతోంది. జిల్లాలో పలు చోట్ల పంటలను కాపాడుకునేందుకు సాగు నీటి కోసం తంటాలు పడుతున్నారు.

యాసంగి ప్రశ్నార్థకం

నెల రోజుల వరకు నిండుగా పోసిన బోరుబావులు ఇప్పుడు మొరాయిస్తున్నాయి. పదుల సంఖ్యలో, వందల ఫీట్లలో బోర్లు వేయడం, నీటి ఊటలేక అవి ఎందుకూ ఉపయోగం లేకుండా పోయాయి. అర ఎకరా, ఎకరా సాగుచేయడమే గగనంగా మారింది. యాసంగి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. అందులో సగం కూడా పండని దుస్థితి క్షేత్రస్థాయిలో నెలకొనడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.


పొలమాకులలో నెర్రలు బారిన వరి పొలం



రెండు ఎకరాలు ఎండింది

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు బండారి దుబ్బ రాజయ్య. మెదక్ జిల్లా నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన ఈ రైతు తనకున్న రెండు ఎకరాలలో వరి పంట వేశారు. ఇందుకు రూ.1.50లక్షలతో 2బోర్లు వేశారు. పంట సాగుకు మరో రూ.50వేలు వెచ్చించారు. మొదట్లో పంటకు నీరు మంచిగానే అందింది. ఎండలు మండుతుండటంతో నీరు అందక పంట పూర్తిగా ఎండి పోయింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలన్న వేదనకు గురువుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని రాజయ్య వేడుకుంటున్నారు.

21 బోర్లు వేసినా చుక్క పడలేదు



నాలుగు ఎకరాలలో వరి సాగు చేస్తున్నా. పంటల ద్వారా వచ్చి డబ్బు అంతా బోర్లకే పెట్టాల్సి వస్తోంది. ఇప్పటి వరకు దాదాపు 21 బోర్లు వేశాను. కానీ ఒక్క బోరు కూడా సక్సెస్ కాలేదు. ఇటీవల కూడా 250 ఫీట్ల వరకు బోరు వేశాను అయినా చుక్క నీరు రాలేదు. ఇప్పటికే దాదాపు రెండు ఎకరాల్లో వరి ఎండిపోయింది.
– మేక లింగయ్య, గాగిల్లాపూర్, మద్దూరు

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయాలి



ఈ యాసంగిలో మూడున్నర ఎకరాల్లో వరి, 2 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేస్తున్న. ఇటీవల 310 అడుగుల మేర బోరు వేసినా నీళ్లు రాలేదు. ఈ యాసంగిలో ఇది రెండోసారి బోరు 270 ఫీట్స్ వేశాను. అరకొరగా నీళ్ళు వస్తున్నాయి. పంటలకు సరిపోవడం లేదు. రెండు బోర్లకు రూ1.20 లక్షలు అయ్యింది. గౌరవెల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేసి సాగు నీటిని అందించాలి.
– గడ్డం అదిరెడ్డి, రైతు, కోహెడ

మాటల తూటాలు

- బీఆర్‌ఎస్ వర్సెస్ బీజేపీ
- ఎలక్షన్లు, కలెక్షన్లు అంటూ రఘునందన్‌పై సెటైర్లు
- వెంకట్రాంరెడ్డికి రూ.వంద కోట్లు ఎక్కడివని కౌంటర్
- వేడెక్కిన మెదక్ లోక్‌సభ రాజకీయం
- సైడైపోతున్న కాంగ్రెస్


పి.వెంకట్రామిరెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి


రఘునందన్‌రావు, బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం షురూవైంది. ఇరు పార్టీల నేతలు పరస్పరం మాటల తూటాలు పేలుతున్నాయి. ఆయా పార్టీల క్యాడర్‌ను ఈ ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగా నిర్వహిస్తున్న సమావేశాల్లో నేతలు ఒకరినొకరు చేసుకుంటున్న ప్రత్యారోపణలతో ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయం వేడెక్కింది. ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీ నేతల విమర్శలు రాజకీయ వర్గాల్లో రచ్చకు దారితీస్తున్నాయి.

బీఆర్‌ఎస్ ఎద్దేవా?

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అంటే ఎలక్షన్లు, కలెక్షన్లు అంటూ బీఆర్‌ఎస్ నేతలు సెటైర్లు వేశారు. గులాబీ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. దుబ్బాకలో ప్రజలు తిరస్కరించిన ఆయన్నే బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దించిందని కారు పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ తీరును కూడా ఎండగట్టారు. నచ్చినోళ్ల జేబులో ఉండాలి నచ్చనోళ్లు జైలులో ఉండాలి అన్నట్లుగా బీజేపీ సర్కారు వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఆయనకు నిధులెక్కడివి?

బీఆర్‌ఎస్ నేతల విమర్శలను కమలం పార్టీ తిప్పికొట్టింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి పి.వెంకట్రాంరెడ్డికి రూ. వంద కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయంటూ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రశ్నించారు. తాను ఎంపీగా గెలిచాక రూ.వంద కోట్లు సొంత నిధులతో పీవీఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తామని వెంకట్రాంరెడ్డి ప్రకటించారు. ఇందులోంచి ఏటా రూ.20 కోట్లతో నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ వివరాలను పక్కాగా వెబ్‌సైట్‌లో ఉంచుతానని స్పష్టం చేశారు. ఆయనకు రూ.వంద కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయంటూ సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన బీజేపీ ముఖ్యనేతల సమావేశంలో రఘునందన్ ప్రశ్నించారు.

నీటి సమస్య పరిష్కరించకుంటే
ఎంపీ ఎన్నికల బహిష్కరణ


ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు, ప్రజాప్రతినిధులు

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

జిన్నారం(పటాన్‌చెరు): తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దీన్ని పరిష్కరించకుంటే లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తామని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీ మహిళలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గోపాలమ్మ, స్థానిక నాయకులు మాట్లాడుతూ బీసీ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించటంలో కమిషనర్, చైర్‌పర్సన్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఏ కాలనీలో లేని సమస్యలు కేవలం తమ కాలనీలోనే ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. నీటి సమస్యతోపాటు సీసీ రోడ్లు, యూజీడీ తదితర సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పెళ్లి బాజాలు మోగాల్సిన చోట..


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చావు డప్పులు..
- మన్సాన్‌పల్లి వద్ద ట్రాక్టర్ బోల్తా: ముగ్గురు దుర్మరణం
- బాచారం గ్రామస్తులను వెంటాడుతున్న మృత్యువు

పాపన్నపేట(మెదక్)/వట్‌పల్లి(అందోల్): పెళ్లి వేడుకలు ఆ గ్రామాల్లో విషాదం నింపాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మన్సాన్‌పల్లి వద్ద ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మృత్యువాత పడగా.. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈఘటనతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 40 రోజుల క్రితం స్నేహితుడి నిశ్చితార్థానికి వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఇదే రీతిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన మరువక ముందే జరిగిన ఘోరాన్ని తలుచుకొని కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామానికి చెందిన చెందిన సొంగ రాము పెళ్లి అందోల్‌కు చెందిన మమతతో గురువారం నార్సింగిలో జరగాల్సి ఉండగా ప్రమాదం జరిగింది. వధువు ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. తెల్లారితే పెళ్లి అనగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో బంధువులతో కళకళలాడిన ఇళ్లు ఒక్కసారిగా మూగబోయింది.

విలపించిన కుటుంబ సభ్యులు

బూదమ్మ భర్త కిష్టయ్య గతంలోనే మరణించగా, కొడుకు లక్ష్మీనారాయణ కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. కూతురు వివాహం జరిగింది. తల్లి మరణంతో కొడుకు ఏకాకిగా మారాడు. కాగా జెట్టిగారి సంగమ్మ భర్త గోపాల్ పక్షవాతంతో బాధపడుతున్నారు. ముగ్గురు కుమార్తెల పెళ్లిళ్లు కాగా కొడుకు ఉపాధి వేటలో ఉన్నాడు. కంటికి రెప్పలా చూసుకుంటూ సపర్యలు చేసే భార్య మరణించడంతో నాకు దిక్కెవ్వరు అంటూ గోపాల్ గుండెలు బాదుకున్నాడు. కాగా రావుగారి ఆగమ్మకు ఒక కూతురు, భర్త మల్లయ్య ఉన్నారు. కూతురు పెళ్లి కాగా మల్లయ్య, భార్య మరణంతో ఏకాకిగా మిగిలిపోయాడు. ఒక్కడినే ఎలా బతికేది అంటూ విలపించాడు.

సంగారెడ్డిలో క్షతగాత్రులకు చికిత్స

ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో 26 మంది గాయపడగా వారందరికీ జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి సంగారెడ్డికి తరలించారు. వీరిలో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువ మందికి తలకు గాయాలు కావడంతో స్కానింగ్ కోసం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు.

జోగినాథ రథానికి పూజలు

జోగిపేట (అందోల్) : స్థానిక జోగినాథ రథోత్సవాలను పురస్కరించుకొని రథానికి బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏప్రిల్ 18న రథం ఊరేగింపు ఉన్నందునా ముందస్తు పరిశీలన నిమిత్తం ఆలయం వద్ద నుంచి గౌని చౌరస్తా వరకు తాళ్లతో రథాన్ని లాక్కెళ్లారు. భక్తులు బిందెలతో నీళ్లు పోశారు. కాగా, జాతర ఈనెల 13 నుంచి 23 వరకు కొనసాగుతుంది.


గౌని చౌరస్తాకు తీసుకొస్తున్న రథం

నీలం మధుకే మెదక్ టికెట్

లోక్‌సభ అభ్యర్థిత్వం ఖరారు చేసిన కాంగ్రెస్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఈ టికెట్ నీలం మధు ముదిరాజ్‌కు దక్కింది. బీసీ సామాజిక సమీకరణ ఈయనకు కలిసొచ్చింది. ఇదివరకే ఈ స్థానం నుంచి బీఆర్‌ఎస్, బీజేపీలు ఓసీలకు టికెట్లు కేటాయించాయి. కాగా, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా బీసీ నేతను బరిలోకి దింపుతోంది. ఈ అభ్యర్థిత్వం విషయమై నీలం మధు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెగ్గారెడ్డి సతీమణి నిర్మల జగ్గారెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపించాయి. బీఆర్‌ఎస్‌లో ఉన్న హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.నరేంద్రనాథ్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. ఆయన కాంగ్రెస్‌లో చేరి టికెట్ దక్కించుకుంటారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. మరో పారిశ్రామికవేత్త పేరు సైతం వినిపించింది. కానీ హస్తం పార్టీ అధినాయత్వం చివరకు మధు వైపే మొగ్గు చూపింది. ఆయనకు సీఎం రేవంత్ ఆశీస్సులున్నాయి.

బీఎస్పీ నుంచి పోటీ

బీఆర్‌ఎస్‌లో చాలా కాలం కొనసాగిన నీలం మధు అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు స్థానం నుంచి టికెట్ ఆశించారు. దక్కక పోవడంతో కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్నారు. చివరి క్షణంలో ఆయన స్థానంలో కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను పార్టీ బరిలోకి దింపడం తెలిసిందే. దీంతో మధు బీఎస్పీ కండువా కప్పుకుని ఆ పార్టీ తరఫున పోటీ చేశారు. మారిన రాజకీయ పరిణామాలతో ఇటీవల కాంగ్రెస్ చేరారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా ఆయనకు ఈ టికెట్ దక్కింది.

వార్డుమెంబర్ నుంచి ఎంపీ అభ్యర్థిగా..

మధు.. 2001లో బీఆర్‌ఎస్‌తో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో వార్డ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. తర్వాత 2019లో చిట్కూర్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఎన్‌ఎంఆర్ ఫౌండేషన్ నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన ఆయనకు పటాన్‌చెరుతో పాటు జిల్లా వ్యాప్తంగా అనుచరులున్నారు. ప్రధానంగా ముదిరాజ్ సామాజికవర్గంలో మంచి పట్టున్న నేతగా పేరుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ సామాజికవర్గం ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన బరిలోకి దించడం ద్వారా ఆ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహించినట్లు అవుతుందని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌లో అవినీతి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గోపికృష్ణ



మాట్లాడుతున్న గోపికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గత ప్రభుత్వం హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో పెద్ద ఎత్తున స్కామ్ జరిగిందని, దీనిపై సీబీఐతో విచారణ చేయించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపి కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపి కృష్ణ మాట్లాడుతూ.. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో ఇంత పెద్ద స్కామ్ జరగడం శోచనీయమన్నారు. పేద ప్రజలకు అందాల్సిన రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలోని సిబ్బంది లబ్ధిదారులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించారని ఆరోపించారు. దీనికిగాను ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలన్నారు. అదే విధంగా బాధితులకు న్యాయం చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్, బబ్బు, శివకృష్ణ, ప్రతాప్, అనీల్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పరికరాలు

రూ.2.5 లక్షలతో కోర్టెవా వితరణ

వర్గల్(గజ్వేల్): పేద విద్యార్థులకు నెలవైన వర్గల్ మండలం శాకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సమీప కోర్టెవా కంపెనీ వివిధ క్రీడా పరికరాలు అందజేసింది. విద్యార్థులకు చదువుతోపాటు, ఉత్సాహంనింపే ఆటలు ఉండాలనే ఉద్దేశ్యంతో రూ.2.5 లక్షల విలువైన స్టీరింగ్ బల్ల, జారుడు బల్ల, ఊయలలు, బ్యాలెన్సింగ్ కుర్చీలు తదితర ఆటల పరికరాలను స్కూల్‌లో బిగింపజేశారు. ప్రతీ తరగతి గదిలో రెండేసి ఫ్యాన్లు, రెండేసీ ఎల్‌ఈడీ లైట్లు, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కోర్టెవా కంపెనీ మేనేజర్ ఉమాశంకర్‌కు స్కూల్ హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగిని వేధింపులో ప్రిన్సిపాల్‌పై విచారణ

– బాధితురాలిని పట్టించుకోని అధికారులు

జోగిపేట (అందోల్) : కళాశాలలో మహిళా ఉద్యోగిని ప్రిన్సిపాల్ లైంగికంగా వేధిస్తున్నారని కేసుకు సంబంధించి బుధవారం మహిళా పాలిటెక్నిక్ కళాశాలల రీజినల్ డైరెక్టర్ త్రినాథ్, ఎస్‌బీ టీఈటీ పుల్లారావు కళాశాలకు వచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కళాశాల సిబ్బందితో వేర్వేరుగా విచారణ చేపట్టినట్లు తెలిసింది. బాధితురాలు అక్కడే విధుల్లో ఉన్నప్పటికీ ఆమెను విచారించకుండానే వెళ్లిపోయినట్లు సమాచారం. అధికారులు వచ్చి తూతూ మంత్రంగా విచారణ చేసి వెళ్లిపోయినట్లు సమాచారం. బాధితురాలిని అడుగగా నేను విధుల్లో ఉన్నప్పటికీ అధికారులు ఏమీ అడగలేదని, కేవలం ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వెళ్లిపోయారని పేర్కొన్నారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు

- దివ్యాంగుడి సైకిల్ యాత్ర

మనోహరాబాద్: మొబైల్ గేమ్స్ వద్దు.. ఆటలే ముద్దు అంటూ పిల్లల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఓ దివ్యాంగుడు కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. బుధవారం మెదక్ జిల్లా తూప్రాన్ వద్ద 44వ జాతీయ రహదారిపై 'సాక్షి' ఆయన్ను పలకరించింది. కాశ్మీర్‌లోని శ్రీనగర్‌కు చెందిన బీ.తమీన్ అన్సారల్ అనే యువకుడు మార్చి 8న కాశ్మీర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఈ యాత్ర ద్వారా చిన్నారులు మొబైల్ గేమ్స్‌ల ద్వారా చదువులు నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు కోల్పోతారని అవగాహన కల్పించడమే లక్ష్యంగా యాత్రను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రోజుకు 120 నుంచి 150 కిలోమీటర్ల మేర కొనసాగుతుందన్నారు.

ఆహ్లాదం.. ఆలస్యం

నిలిచిన అర్బన్ పార్కు పనులు

- రూ.12 కోట్లతో ప్రణాళికలు
- రూ.5 కోట్లతో చేపట్టాలని నిర్ణయం
- నిధుల కొరతతో ముందుకుసాగని వైనం
- పట్టణవాసులకు అందని ఆహ్లాదం

జహీరాబాద్ పట్టణ సమీపంలో చేపడుతున్న 'అర్బన్ ఫారెస్ట్ పార్క్' పనులు ముందుకు సాగడం లేదు. వినియోగంలోకి రావాల్సిన పార్కు తుది దశకు వచ్చేసరికి పనులు ఆగాయి. నిధుల కొరత కారణంగా సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో పూర్తి చేయాలనుకున్నా పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. – జహీరాబాద్ టౌన్



జహీరాబాద్ అర్బన్ ఫారెస్టు పార్కు ముఖద్వారం

జహీరాబాద్ పట్టణం తెలంగాణ– కర్నాటక సరిహద్దులో ఉంది. పట్టణం దిన దినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పలు పరిశ్రమలు ఉండగా కొత్తగా జాతీయ ఉత్పాదక పెట్టుబడి మండలి(నిమ్జ్), రైల్వే శాఖ కాంప్లెక్స్, సోలార్ పవర్ ప్రాజెక్ట్ తదితర బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయి. ప్రజలకు ఆహ్లాదం సమకూర్చడానికి ప్రభుత్వం జహీరాబాద్‌లో అర్బన్ ఫారెస్టు పార్క్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పట్టణ సమీపంలో మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారానికి ఆనుకొని 65వ జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఫారెస్టు ప్రాంతంలో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 200 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయాలని సుమారు రూ.12 కోట్ల అంచనాలతో పనులు చేపట్టాలని ప్రణాళికలను రూపొందించారు. నిధుల సమస్య కారణంగా రూ. 3 నుంచి 5 కోట్లతో పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఫారెస్టు క్షేత్రం హద్దును గుర్తింపు, ప్రహరీ నిర్మాణం, పచ్చదనం పెంపు, సహజ అడవి పునరుద్ధరణ, యోగస్థలం, నడక దారి, సైక్లింగ్ ట్రాక్, మంచి నీటి సౌకర్యం తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించారు.



శంకుస్థాపన సమయంలో పార్కు ఏరియాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, కలెక్టర్ హన్మంత రావు తదితరులు(ఫైల్)

అసంపూర్తిగా పనులు

నాలుగేళ్ల కిందట అప్పటి కలెక్టర్ హన్మంతరావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు పార్కు పనులకు శంకుస్థాపన చేసి అర్బన్ పార్క్ పనులను ప్రారంభించారు. ప్రారంభంలో పనులు చురుగ్గా కొనసాగాయి. తర్వాత నిధుల కొరత కారణంగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు హద్దులు గుర్తించడం, పచ్చదనం పెంపుదల, ఎత్తైన ప్రదేశాల నుంచి అటవీ అందాలను తిలకించేందుకు టవర్ నిర్మాణం, ప్రవేశ ద్వారం, వర్షం నీరు ఒడిసి పట్టేందుకు చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు చేపట్టారు. వాకింగ్ ట్రాక్ తదితర పనులు నిధులు లేక ఆగిపోయాయి.

నిధుల కొరత వల్లే..



జహీరాబాద్ ఫారెస్టు అధికారిణిగా బాధ్యతలు తీసుకోకముందే అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఆగిన పనులు విషయంపై ఎమ్మెల్యే మాణిక్‌రావుతో గతంలో చర్చించాం. నిధుల కొరత కారణంగా పనులు ఆగాయి. సరిపడా నిధులు విడుదలైతే మిగులు పనులను పూర్తి చేసి పార్కును వినియోగంలోకి తీసుకొస్తాం.

– రాధికరెడ్డి, ఎఫ్ఆర్‌ఓ, జహీరాబాద్

ముందుకు రాని కంపెనీలు

జహీరాబాద్ ప్రాంతంలోని పరిశ్రమలు ముందుకొచ్చి సామాజిక బాధ్యతగా అర్బన్ పార్క్‌ను డెవలప్ చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా పిలుపునిచ్చారు. కానీ పరిశ్రమల యజమాన్యాలు ముందుకురాలేదు. అర్బన్ పార్క్ మిగులు పనులు పూర్తి చేసి పట్టణ ఆహ్లాదాన్ని అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫోన్ ట్యాంపింగ్‌లో హరీశ్ పాత్ర

త్వరలో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశం: రఘునందన్

సంగారెడ్డి: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాత్ర ఉందని మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో కూడా హరీశ్ తనపై ఫోన్ ట్యాపింగ్ చేయించారని తెలిపారు. ప్రస్తుతం ఈ విషయం హరీశ్‌కు ఉచ్చు బిగుస్తుండటంతో ఆత్మరక్షణ కోసం కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని, వేల కోట్ల ఆస్తులు సంపాదించారని విమర్శించారు. పటాన్‌చెరులో హరీశ్‌రావు అక్రమ మైనింగ్ నిర్వహించారని ఆరోపించారు. మెదక్ సీటును కచ్చితంగా గెలుస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిలపై మండిపడ్డారు. ఇతర ప్రాంతాల వారికి టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. మెదక్ జిల్లాపై తన పెత్తనం చూపెట్టుకోవడం మానుకోవాలన్నారు. గతంలో మెదక్ ఎంపీగా కొత్త ప్రభాకర్ రెడ్డిని రెండుసార్లు గెలిచారు కానీ ఒక్కసారి కూడా పార్లమెంట్లో మాట్లాడలేదన్నారు. బీరయ్య యాదవ్, ఆర్ సత్యనారాయణకు ఎంపీ టికెట్ ఇవ్వడం చేతగాని దద్దమ్మలు కేసీఆర్, హరీశ్‌రావులన్నారు. ఇప్పటికే కారు టైరు పంక్చర్ అయ్యిందన్నారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ మద్యం కేసులో తీహార్ జైలుకు పోయిందన్నారు. ఇటువంటి దొంగలకు మళ్లీ ప్రజలు ఓటు వేయబోరని తెలిపారు.



మాట్లాడుతున్న రఘునందన్ రావు

ఈఎస్‌ఐకి తాళం

- అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్పిటల్
- రెండేళ్లుగా కిరాయి చెల్లించడం లేదని ఇంటి యజమాని ఆవేదన

జహీరాబాద్: పట్టణంలో గల ఈఎస్‌ఐ ఆస్పత్రిని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా అద్దె చెల్లించక పోవడంతో ఇంటి యజమాని బుధవారం ఉదయం గేటుకు తాళం వేశాడు. విధులు నిర్వహించేందుకు వచ్చిన వైద్యుడు, సిబ్బంది ఆస్పత్రి బయటే ఉండి పోయారు. అద్దె చెల్లింపులు, ఆస్పత్రికి తాళం వేసిన విషయమై వైద్యుడు శరత్‌చంద్ర ఈఎస్‌ఐ ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా సంప్రదించాడు. వారం రోజుల్లో చెల్లిస్తామని ఉన్నతాధికారులు చెప్పిన విషయాన్ని ఇంటి యజమానితో చెప్పాడు. ఎప్పుడూ ఇదే సమాధానం వస్తోందని, ఆస్పత్రిని తెరిచేందుకు ససేమిరా అన్నాడు. 2022 జూన్ నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.3లక్షల వరకు పెండింగ్‌లో ఉందన్నారు. ఎప్పుడు అడిగినా దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారని, అద్దె చెల్లింపులకు సంబంధించి లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాల్సిందిగా కోరాడు. వారం రోజుల వరకు సమయం ఇవ్వాలని, ఆ తర్వాత తథనుగుణంగా చర్యలు చేపట్టండని వైద్యుడు విన్నవించారు. దీంతో యజమాని ఉదయం 11.45 గంటలకు గేటుకు వేసిన తాళం తీశాడు. ఉదయం 10 గంటలకే రోగులు ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న పరిస్థితిని తెలుసుకుని వెనుదిరిగి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి వైద్య సేవలను కొనసాగించారు.



ఈఎస్‌ఐ ఆస్పత్రి గేటుకు వేసిన తాళం

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- స్వయంగా ఉపాధికి రుణాలు ఇప్పించాలి
- డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య
- ఐకేపీ అధికారులతో సమీక్ష

హుస్నాబాద్ రూరల్: గ్రామీణ స్వశక్తి మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల ఐకేపీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. స్వశక్తి సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ లక్ష్యం చేరుకున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రుణ లక్ష్యం నిర్దేశించుకొని ప్రణాళిక బద్ధంగా మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను స్వయం ఉపాధికి ఉపయోగిస్తే మహిళలు ఆర్థిక ప్రగతి సాధించి సమాజంలో వ్యాపారులుగా నిలబడుతారని చెప్పారు. అనంతరం పోతారం(ఎస్)లోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి మహిళలతో వారు పనిలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాల్లోని ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. వేసవి కాలంలో పని లేకుండా ఇంట్లో కూర్చుంటారని వారిని గుర్తించి ఉపాధిహామీ పని కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ మధుసూదన్, డీపీఎంలు విద్యాసాగర్, కరుణాకర్, ఏపీఎంలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయదేవ్ ఆర్య

ఇన్విజిలేటర్ తొలగింపు

- సమగ్ర విచారణ జరిపి నివేదికను సమర్పించాలి
- డీఈఓ ఎంఈఓకు ఆదేశాలు జారీ

కొండపాక(గజ్వేల్): విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్ భాకి చంద్రభానును ఇన్విజిలేటర్‌గా విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఈఓ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దుద్దెడలోని పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థినితో ఇన్విజిలేటర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విద్యార్థిని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మి దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో చంద్రభానును ఇన్విజిలేటర్ విధుల్లో నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదికను సమర్పించాలంటూ పేర్కొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న దుర్గాప్రసాద్, తదితరులు

విజ్ఞానజ్యోతి సంస్థ వైస్ చైర్మన్ దుర్గాప్రసాద్

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయ అభివృద్ధికి విజ్ఞానజ్యోతి విద్యార్థులు కృషి చేయాలని విజ్ఞానజ్యోతి సంస్థ వైస్ చైర్మన్ కోడె దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణ అభివృద్ధి విద్యా సంస్థ, వ్యవసాయ కళాశాలలో 20వ వార్షికోత్సవం, అదే విధంగా నాబార్డ్ సహకారంతో ఆరు నెలలు వ్యవసాయ శిక్షణ పూర్తి చేసుకున్న 28వ బ్యాచ్ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. విజ్ఞానజ్యోతి కళాశాలలో శిక్షణ పొందిన విద్యార్థులు వ్యవసాయంలో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు, అధిక దిగుబడులు సాధించి, ఎకరాకు రూ.లక్ష సంపాదించాలన్నారు. అనంతరం జిల్లా హార్టికల్చర్ అధికారి నర్సయ్య మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు కూరగాయాలు పెంచడం వల్ల మంచి లాభాలు పొందవచ్చన్నారు. నాబార్డ్ మేనేజర్ సీసీల్ తిమోతీ, హార్టికల్చర్ డైరెక్టర్ చక్రపాణి మాట్లాడారు. కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి సంస్థ ప్రతినిధులు అచ్యుత రాంప్రసాద్, రవినాథ్, వెంకట్రావ్, కోటేశ్వరరావు, డైరెక్టర్ అర్జున్ రావు, నాబార్డ్ సంగారెడ్డి జిల్లా మేనేజర్ కృష్ణతేజ, విజ్ఞానజ్యోతి ఫీల్డ్ సూపర్‌వైజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



నర్సింలు(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న చిలప్‌చెడ్ మండలం చండూర్ శివారులో చోటు చేసుకుంది. మంగళవారం చండూరు గ్రామంలోని దేవుని చెరువులో అనుమానాస్పదంగా యువకుడి మృతదేహం లభ్యం కాగా, అది ఆత్మహత్యగా తేలింది. ఎస్‌ఐ షేక్ మహబూబ్, మృతుడి అక్క మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. చందూర్ గ్రామానికి చెందిన గట్టుమీది నర్సింలు(20) చిన్నప్పుడే అమ్మ మల్లమ్మ చనిపోయింది. తండ్రి రాజయ్య అనితను రెండో వివాహం చేసుకున్నాడు, వారికి ఇద్దరు పిల్లలు పుట్టాక కొద్ది కాలం అనంతరం రాజయ్య మృతి చెందాడు. నర్సింలు చిన్నమ్మ అనిత కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఏ పని లేకుండా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనిత నర్సింలును ఖాళీగా తిరిగే బదులు ఏదైనా పని చేసుకొమ్మని మందలించింది. మనస్తాపానికి గురైన అతడు సోమవారం దేవుని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై..

చిన్నశంకరంపేట(మెదక్): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని అంబాజీపేట గ్రామానికి చెందిన ద్యాప శివకుమార్(26) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అనారోగ్యంపాలై చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తితో ఈనెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూమి కోసమే హత్య

తంప్లూర్ కేసును ఛేదించిన పోలీసులు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): భూమితోపాటు డబ్బుల కోసం మహిళను హత్య చేసిన వ్యక్తి కటకటాల పాలయ్యాడు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అల్లాదుర్గం సీఐ రేణుక, ఎస్‌ఐ మురళీ వెల్లడించారు. మండలంలోని తంప్లూర్ గ్రామానికి చెందిన దుబ్బగళ్ల సంగమ్మ(44) గతేడాది భర్త మరణించడంతో ఇంట్లో ఒంటరిగానే నివసిస్తుంది. సంగమ్మకు పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామానికి చెందిన తన ఆడపడుచుతో కొంత కాలంగా భూ వివాదం కోర్టులో సాగుతుంది. ఈ విషయమై సంగమ్మ వరుసకు కొడుకైన వట్‌పల్లి మండలం మర్వెల్లి గ్రామానికి చెందిన మల్లగుల్ల యేసుతో ఈనెల 20న లాయర్‌ను కలవడానికి బైక్‌పై జోగిపేటకు వెళ్లారు. లాయర్ లేకపోవడంతో ఇద్దరూ బైక్‌పై తిరిగి తంప్లూర్‌కు వచ్చారు. సంగమ్మను చంపేస్తే, ఆ భూమి తన అత్తకు (సంగమ్మ ఆడపడుచు), తనకు దక్కుతుందని పథకం వేశాడు. ఈ నెల 21వ తేదీన తెల్లవారుజామున సంగమ్మ గాడ నిద్రలో ఉండగా ఇంట్లో సుత్తిని తీసుకొని, ఆమె తలపై కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం కొడవలితో బీరువా తెరిచి బంగారు ఆభరణాలు తీసుకొని పరారయ్యాడు. కేసును దర్యాప్తు చేయగా నిందితుడు మర్వెల్లిలో దొరికినట్లు తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

పటాన్ చెరు టౌన్: అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సునీల్ చౌదరి (44) నాలుగేళ్ల కిందట బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓడీఎఫ్ కాలనీలో ఉంటున్నాడు. పాశమైలారం పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో హెల్పర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం సేవించే అలవాటు ఉన్న సునీల్ ఈనెల 25వ తేదీన డ్యూటీకి వెళ్లి వచ్చి, సాయంత్రం కాంట్రాక్టర్ వద్దకు వెళ్లి డబ్బులు తెచ్చుకున్నాడు. రాత్రి రూమ్ నుంచి బయటకు వెళ్లి కాలనీలోని ఓ ఖాళీ స్థలంలో మద్యం సేవించి అక్కడే పడిపోయాడు. బుధవారం అక్కడే సునీల్ చౌదరి మృతి చెంది కనిపించడంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనారోగ్యంతోపాటు, అతిగా మద్యం సేవించి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో కారు, బైక్

నిజాంపేట(మెదక్): కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని చల్మెడ కమాన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నిజాంపేట మండల పరిధిలోని నంద గోకుల్ గ్రామానికి చెందిన మ్యాదరి కరుణాకర్, చౌడ స్వామి బైక్‌పై గ్రామం నుంచి రామాయంపేటకు ఇంటి పనుల నిమిత్తం వెళ్తున్నారు. చల్మెడ కమాన్ వద్ద రామాయంపేట వైపు వెళ్తుండగా అదే సమయంలో రామాయంపేట నుంచి సిద్దిపేటకు వివాహ నిమిత్తం వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కి తరలించారు. మరో వ్యక్తి స్వామిని రామాయంపేటలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఇరిగేషన్ ఏఈ..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఇరిగేషన్ ఏఈ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని కృషి డిఫెన్స్ కాలనీలో నివాసం ఉండే సంగారెడ్డి ఇరిగేషన్ ఏఈ భార్య దేవిక(36) బుధవారం ఉదయం ఇంట్లో పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తండ్రి సుదర్శన్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌కు నిప్పు



కాలిపోయిన బైక్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటి ఎదుట నిలిపిన బైక్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన ఘటన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో చోటు చేసుకుంది. బుధవారం ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్‌కు చెందిన గాండ్ల రాములు తన బైక్‌ను ఇంటి వద్ద నిలిపి గేటుకు తాళం వేసి పడుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ దూకి బైక్‌కు నిప్పంటించారు. రాత్రి 2 గంటల సమయంలో రాములు ఇంటి ఎదుట నివాసం ఉండే ఓ వ్యక్తి గుర్తించి రాములును నిద్రలేపాడు. వెంటనే బాధితుడు కాలుతున్న బైక్‌పై నీళ్ల చల్లి ఆర్పేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామరు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన బుధవారం పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయలలో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గుడ్ల సిద్దిరాములు (28) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి మిత్రుల విందులో పాల్గొనేందుకు ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం మిత్రుడితో కలిసి కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెక్‌డ్యాం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగాడు. తోటి మిత్రుడు స్థానికులకు తెలుపడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నరేశ్ సిబ్బందితో చేరుకొని సిద్దిరాములు కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం దక్కలేదు. బుధవారం చెక్ డ్యాం వద్దకు వెళ్లి గజఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

నగదు, ఆభరణాలు అపహరణ



వివరాలు సేకరిస్తున్న ఎస్సై గంగరాజు

దుబ్బాక : దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో దొంగలు మంగళవారం రాత్రి బీభత్సం సృష్టించారు. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన తోట్ల వెంకటేశ్, రేణుక దంపతులు బల్వంతాపూర్‌కు వెళ్లే దారిలో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో కూతురుతో కలిసి ఉంటున్నారు. మంగళవారం దంపతులు ఇద్దరూ పని నిమిత్తం బయటకు వెళ్లి, రాత్రికి ఇంటికి తిరిగి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.38 వేల నగదు, అర తులం బంగారం, 20 తులాల వెండి దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగలోకి దిగిన పోలీసులు క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. బుధవారం బాధితురాలు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామచంద్రాపురం(పటాన్ చెరు) : రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బండ్లగూడలోని నందన్ రతన్ ఫ్రైడ్‌లో నివాసముండే హనుమంత్, శ్రీనివాస్ ఎదురెదురుగా ఉంటారు. ఈనెల 24వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం ఇంటికొచ్చేసరికి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. హనుమంత్ ఇంట్లో బీరువాలోని 4 తులాల బంగారం, శ్రీనివాస్ ఇంట్లో 40 తులాల వెండి, నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.